# కనువిప్పు

రచన :
'కుమారి ఎ. పద్మావతి'

శేఖర్ ఇంటరు చదివే రోజుల్లో, తండ్రి మరణం సంభవించటంతో, తన పట్నం చదువుకు డబ్బుపంపి యింటిభారం నెత్తిన వేసుకొనే అండలేకపోవటంతో అతని చదువుకు అంతరాయం కల్గింది. కాలేజీ విడవాలంటే శేఖర్‌కు మొదట్లో చాలా కష్టమనిపించింది. కాని ఆ పరిస్థితులలో చదువుకు స్వస్థిచెప్పటమే మంచిదని తోచింది. తండ్రి మిగిల్చిపోయినది ఒక విధంగాచూస్తే పెద్ద ఆస్తి ఏమీ కాదనే చెప్పాలి.

శేఖర్ ఆవూరి వారందరి సలహామీదా వ్యవసాయం లోనికి దిగాడు. అతనికొక చిట్టిచెల్లెలు తల్లి తప్ప మరెవ్వరూ లేరు. అతని మేనమామ మాత్రం రాజమండ్రీలో ఏదో కంపెనీలో మేనేజరుగ ఉంటున్నారు. ఆయనకు మాత్రం వీళ్ళ సంసారం నెత్తిన వేసికొనే తీరుబడిలేదు. ఆయన ఏకైక పుత్రిక పేరు శారద. శారద అంటే తల్లీ తండ్రికి మహాగారాబం. శేఖర్ కంటే శారద రెండేళ్ళు చిన్న. చిన్నప్పుడు శారద కంటే శేఖర్ ఎక్కువ క్లాసు చదివేవాడు. కాని శేఖర్ చదువుకు ఆటంకం కల్గడంవల్ల శారద యిప్పుడు బి. ఎ. చదువుతోంది. శేఖర్‌కు మొదటినుంచీ శారద అంటే చాలా యిష్టం. శేఖర్ తల్లి సుందరమ్మ గార్కికూడ శారదను తన కోడలిగ జేసికోవాలని ఉండేది. ఒకనాడు శేఖర్ భోంచేస్తూవుంటే సుందరమ్మగారు అతనితో "మామయ్యకు ఉత్తరం వ్రాద్దామనుకుంటున్నాను నాయనా" అంది. "ఏమనమ్మా" అన్నాడు. "ఏమనేమిట్రా శారదను ఈ ఇంటికోడలిగాచెయ్యమని" అంది. శేఖర్‌కు తెలుసు శారద తనని చేసికోడానికి నిరాకరిస్తుందని. ఆవిషయమే తల్లితో చెప్పాడు. కాని ఆవిడ ఆశమాత్రం పోలేదు. అందుకని తనే స్వయంగా వెళ్ళి కనుక్కొని వస్తానంది. తల్లిని నిరుత్సాహ పరచడం ఇష్టంలేక మరునాడు ప్రక్క వూరికి పోయి రైలు ఎక్కించి వచ్చాడు. పోయిన నాల్గురోజులకే తలి తిరిగి వచ్చింది.

ఆరోజు రాత్రి భోంచేస్తూ వుంటే "ఏమన్నాదమ్మా మామయ్య" అన్నాడు. "ఏమనడమేమిటి నాయనా శారద మునపటి శారదకాదు. ఒక్కనిముషం ఇంట్లో ఉండదు. మొగ స్నేహితులతో కలిసి సినీమాలు, షికార్లూనూ. మామయ్య, అత్తయ్యకూడ తమకు పట్టనట్టే వూరుకునేవారు. ఏమిటోనాయనా నాకుమాత్రం చాలాఆశ్చర్యమేసింది. నేను వెళ్ళిన మూడోనాడు "ఎప్పుడొచ్చావు అత్తయ్యా" అంది. ఈ వరసంతా చూస్తే నాకు అడగాలనే అనిపించలేదు. అయినా చిన్నతనం మన యింటికివస్తే అదే సర్దుకు పోతుందిలే అని ఆరాత్రి మామయ్యనుకదలేశాను. మామయ్య కూడ దాని వరుణ్ణి వెతుక్కునే భారం దాని మీదే పెట్టానన్నాడు. ఇంతలోకి శారద ఆ గదిలోకివచ్చి ఏమిటి నాపెళ్ళి శేఖర్ బావతోనా? ఓ! చాలా బావుంటుంది జంట. అయినా శేఖర్‌కు ఇంగ్లీషులో సంతకం చేయడమైనా వచ్చో రాదో అని నా అనుమానం. నాన్నా! నేను యిప్పుడు పెళ్ళి చేసుకోను అంటూ వెళ్ళిపోయింది. అంతే ఒక్కక్షణం అక్కడవుండబుద్ధికాలేదు వచ్చేశాను" అంటూ ముగించింది. శేఖర్ ఒక నిట్టూర్పు విడిచి మజ్జిగమ్మా అన్నాడు. భోజనం ముగించి ఆలోచిస్తూ పడుకున్నాడు.

శేఖర్‌కు ఆవూళ్ళో మంచి పలుకుబడి ఉంది. ఎవరికి ఏతగువు వచ్చినా అతనిదగ్గరకు వచ్చేవారు. ఎంతో నేర్పుతో వారితగువు తీర్చి పంపేవాడు. ఆ సంవత్సరం ఎక్కువ ఓట్లతో ఆవూరి ప్రెశిడెంటుగా కూడ ఎన్నికయ్యాడు. వీళ్ళింటికి ఎదురుగా ఆవూరి పెద్దకాపు గారి యిల్లుండేది. ఆయనకు శేఖర్ అంటే ఎంతో ప్రేమ. ఆయన రోజూ ఒకగంటసేపైనా శేఖర్‌తో గడిపేవారు. ఆయనకు పురుషులతో సమానంగా స్త్రీలుకూడా చదవాలని పట్టుదల. అందుకే ఆయన తన కూతురైన నిర్మల స్కూలుఫైనలు పూర్తిచెయ్యగానే రాజమండ్రీలో బంధువుల యింటవుంచి కాలేజీలో చేర్పించారు.

వేసవి శలవులకు నిర్మల ఇంటికి వచ్చింది. ఒకరోజు శేఖర్, నిర్మలతండ్రి కూర్చొని దేనినిగురించో చర్చించుకుంటున్నారు. అదే సమయంలో నిర్మల స్నేహితురాలింటికి పోయివస్తోంది. తండ్రి నిర్మలను పిలిచి "అమ్మా శేఖర్ గురించి నీకు తెలిసే ఉంటుంది. నీకు తెలియనిదేదైనా ఉంటే అతన్నడుగమ్మా" అన్నాడు. "అట్లాగే నాన్నా" అంది. ఆమరునాడు నిర్మల ఒక పుస్తకం తీసికొని శేఖర్ దగ్గరకు వెళ్ళింది. అప్పుడు అతను తన లైబ్రరీ హాలులో కూర్చొని ఏదో చదువుకుంటున్నాడు. శేఖర్ నిర్మలను కూర్చోమని కుర్చీ చూపాడు. నిర్మల అతని లైబ్రరీ చూచి ఆశ్చర్యపోయింది. తరువాతపుస్తకం తీసి తనకు కావలసింది తీసి చూపించింది. శేఖర్ అది చదివి బాగా అర్థమయ్యేలాగ చెప్పాడు. నిర్మల తన ఈ ఏడాది చదువులో ఏ లెక్చరర్ కూడ యింత బాగా చెప్పడం వినలేదు. అంతా వినిన తరువాత అతనివద్ద శలవు తీసికొని వెళ్ళిపోయింది. నిర్మల ఆరాత్రంతా అతన్ని గురించి ఆలోచనలతోనే నిద్రపోయింది.

రోజూ నిర్మల శేఖర్‌తో ఏదో ఒకదాన్ని గురించి చర్చించేది. అతనితో కూడా అప్పుడప్పుడు తోటలోనికి పోయి అతనికి సహాయపడుతూ శలవలు చాలాఉల్లాసంగా గడుపుతోంది. అల్లా అల్లా శేఖర్ స్నేహంలో శలవలు యిట్టే గడిచిపోయాయి. కాలేజీ తెరిచేరోజులు దగ్గిరపడే కొలదీ నిర్మలకు ఎందుకో దిగులుగావుంటోంది. ఎప్పుడు వేసవి శలవలు వచ్చినా, ఎప్పుడు మళ్ళా స్కూలు తెరుస్తారా అని ఎదురుచూచేది. కాని ఈసారి మాత్రం కాలేజీకి పోవాలంటే ఏదో తెలియని బాధ పట్టుకుంది. మరునాడు కాలేజీ తెరిచేరోజు. ఆ సాయంత్రమే నిర్మల రైలుకు వెళ్ళాలి. అందుకని తన సామానంతా సర్దుకొని తండ్రితో బండికి పంపమని చెప్పి సుందరమ్మగారింటికి పోయి వస్తానని చెప్పి బయలుదేరింది. శేఖర్ గదిలో కూర్చొని ఏదో వ్రాస్తున్నాడు. నిర్మల వెళ్ళి అతనిప్రక్కన నిలుచుంది. శేఖర్ తలపైకెత్తి చూశాడు. నిర్మల తన ప్రయాణం సంగతి అతనితో చెప్పింది. ఎందుకో నిర్మల ఎంత ఆపుకుందామనుకున్నా ఆ కన్నీళ్ళు ఆగలేదు. శేఖర్ అప్రయత్నంగా లేచి నిర్మలను దగ్గరకు తీసుకున్నాడు. నిర్మల అతని గుండెలమీద వాలిపోయింది. శేఖర్ నిర్మలతల నిమురుతూ "బాగా చదివి ఫస్టుక్లాసు తెచ్చుకో నిర్మలా" అన్నాడు. "ఊఁ" అని మాత్రం అని ఇంటికి వెళ్ళిపోయింది.

ఇంటిదగ్గర సామానంతా బండిలో పెట్టించి తనకోసం సిద్ధంగా ఉన్నారు. నిర్మల తండ్రి "ఎక్కమ్మా బండి" అన్నారు. ఆమె "నేను వెళ్ళను నాన్నా సామానుదింపి బండిని పంపేయి"అన్నది. అది విని అదేమమ్మా వంట్లో బాగాలేదా అని ఆయన తెల్లబోయారు. అదికాదు నాన్నా నేను యిక కాలేజీకి పోను. నాకింక ఆ డిగ్రీతో పనిలేదు. "శేఖర్‌కు నన్నిచ్చి...." అని యింక సిగ్గుతో చెప్పలేక తలవంచుకుంది. తండ్రి ఆమెభావంగ్రహించి "అదాతల్లీ! అంతకంటే మాకు మాత్రం కావలసినదేముంది" అని బండివాణ్ణి పంపి సుందరమ్మగారి దగ్గరకు బయలుదేరారు. సుందరమ్మగారు అంతా విని నిర్మల తనకోడలవుతున్నందుకు చాలా సంతోషించారు.

పెళ్ళిపనులు అటు ఇటుకూడ జోరుగాసాగుతున్నాయి. సుందరమ్మగారు తన కొడుక్కి ఆ వూరులోనే ఒక సంబంధం కుదిరినట్లు, శేఖరుకు మూడుముళ్ళు పడే భారం ఆయనమీద వున్నదన్నట్లు పెళ్ళికి వారంరోజులు ముందుగానే రావలసినదనీ కోరుతూ తమ్ముడికి ఒక ఉత్తరం వ్రాసింది. బంధువులలో బావుండదని పెళ్ళి రాత్రనగా అ సాయంత్రం దిగా రాయన. మొదట శారద పెళ్ళికి రానంది. తరువాత ఏమనుకుందో కాని వచ్చింది. శారద గుమ్మంలో అడుగుపెడుతూ ఇంట్లో వుండే వస్తువులు వాటి అలంకరణ చూసి శేఖరుకు యింత నాగరికత తెలుసా అనుకుంది. తరువాత శేఖర్ చెల్లెలు శారదకు ఒక్కొక్కగదే చూపెడుతోంది. చివరకు అతని లైబ్రరీ ఉన్న గదిలోనికి వచ్చారు. ఇది అన్నయ్య చదువుకొనేగది అంది అతని చెల్లెలు. శారద షెల్ఫులో ఉండే ఒక్కొక్క పుస్తకమేతీసి చూడసాగింది. ఇంతలో శారదను ఎవరోపిలిస్తే క్రిందకు వచ్చేశారు.

పెండ్లి ముహూర్తం దగ్గరకువచ్చింది. పెండ్లికూతుర్ని తీసికొనివచ్చి కూర్చోపెట్టారు. శారద పెళ్ళికూతుర్ని చూసింది. ఆ నిర్మల ఎవరోకాదు వాళ్ళ కాలేజీలో చదువుతూ జాయింటుసెక్రటరీగా ఎన్నిక అయి అందరితో చాలా కలివిడిగా వుండే నిర్మలే. ఇంక శారదకు ఒక్క క్షణం అక్కడ కూర్చోబుద్ధికాలేదు. వచ్చి గదిలో పడుకుంది. బుర్ర ఆలోచనలతో దిమ్మెక్కుతోంది. శేఖర్, అతని లైబ్రరీ, నిర్మలా ఒక్కొక్కటే కళ్ళముందు తిరుగుతున్నాయి. శేఖర్‌లో యింత గొప్పతనం యిమిడి వుందా అని ఆశ్చర్యపోయింది. తన్ను తాను ఎంతగానో నిందించుకుంది. ఏమనుకుంటే ఏంలాభం శేఖర్ నావకు

పెళ్ళి అయిపోతోంది. ఆనాడు అత్తయ్యదగ్గిర అతని గురించి ఎంత హేళనగా మాట్లాడింది తను. అబ్బ! తను యింక శేఖర్ ముఖం ఏవిధంగా చూడగలదు. ఈ ఆలోచనలతోనే తెల్లవారింది.

మరునాడు తనకు వంట్లో బాగుండలేదనే వంకతో తల్లినీ తండ్రినీ ప్రయాణం చేసింది. నిర్మల శారదను గుర్తించి ఎంతో ఆప్యాయంగా తన స్నేహితురాంఢ్రను గురించి, కాలేజీని గురించి అడిగింది. శారద ప్రయాణం సంగతి విని మరికొన్ని రోజులు వుండమని బలవంతం చేసింది. ఇంతలోకి శేఖర్ కూడా అక్కడకువచ్చి ఒక్క వారం రోజులైనా తమతో గడిపివెళ్ళమని చెప్పాడు. సుందరమ్మ గారుకూడ వుండమని బలవంతం చేసింది. ఎవరెన్ని చెప్పినా శారదకు వంట్లో బావుండలేదని మంచి డాక్టరుకు చూపించాలని చెప్పి బండి ఎక్కారు.

శారద ఎందుకు యింత తొందరగ వెళ్ళిపోతోందో తెలిసికోలేని ఆ దంపతులు బండి కనుచూపుమేర దాటే వరకూ చూస్తూ అలాగే నిలబడ్డారు.

---


బిడ్డల లివరు అండు స్ప్లీను వ్యాధులకు

పాత్రుడుగారి బాలసంజీవిని

డాక్టరు పిల్లా పాపయ్యపాత్రుడు & బ్రదరువారి "బాలసంజీవిని" నిజముగ అమోఘమైనది. బిడ్డలకు సంభవించు లివరు అండు స్ప్లీను వ్యాధులలో ప్రథమ దశయందుగాని, కాంప్లికేటెడ్ స్థితియందుగాని తప్పకుండ గుణమిచ్చును. వైద్యవృత్తియందును నా స్నేహితులలోను బంధుకోటిలోను అనేకులు ఉపయోగించుటవల్లను "బాలసంజీవిని" యొక్క గుణాతిశయములు పరీక్షించుట కవకాశమేర్పడినది. బజారులోగల యితర లివరు ఔషధములుగూడ యిదివరలో వాడి చూచితినిగాని "బాలసంజీవిని" వాడిన పిమ్మట పైవాటినెల్ల విసర్జించి దీనినే హెచ్చుగ వాడుచున్నాను. అమోఘముగ నిట్టి మహదౌషధమును ప్రజోపయోగమునకు వినియోగించుచున్నందుకు పిల్లావారి వంశము స్తుతిపాత్రమైనది.

డాక్టరు : ..............................

వివరములకు:

డాక్టరు పిల్లా పాపయ్యా పాత్రుడు & బ్రదరు,

నెం. 19, దక్షిణమాడా వీథి, మైలాపూరు, మద్రాసు 4.

ఫోను : 71354

కుంభకోణం బ్రాంచి :

నెం. 7 సారంగపాణికోవిల్

తూర్పు వీథి.

అన్ని మందుల షాపులలోను దొరకును.